‘గాంధీ’లో సర్జరీ చేసేందుకు డబ్బులు అడిగారు!

బాధితుడి భార్య ఆరోపణ

గాంధీఆస్పత్రి : లక్షలాది మంది నిరుపేదలకు ఉచిత వైద్యసేవలు అందిస్తున్న తెలంగాణ వైద్య ప్రదాయినీ సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో ఆపరేషన్ చేసేందుకు డబ్బులు అడిగారని బాధిత రోగి భార్య ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసింది. ఖమ్మం జిల్లా మధిర నిధానపురంకు చెందిన గుండా వెంకటరెడ్డి (77) మోకాలిచిప్ప మార్పిడి కోసం కొన్ని రోజుల క్రితం గాంధీ ఆర్థోపెడిక్ విభాగంలో చేరాడు. దివంగతనేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకం ద్వారా టోటల్‌-నీ రీప్లేస్‌మెంట్ (టీకేఆర్) సర్జరీ చేస్తామని చెప్పి పలుమార్లు వాయిదా వేశారు. ఆపరేషన్ చేసే వైద్యుడు తన గదికి పిలిపించుకుని సర్జరీ కోసం డబ్బులు అడిగారని, డబ్బులు ఇవ్వకుంటే నాణ్యత లేని వైద్య పరికరాలు వినియోగిస్తామని, డబ్బులు ఇవ్వనందుకే సర్జరీ వాయిదాలు పడుతున్నాయని భయపెట్టారని, సూపరింటెండెంట్‌ను ఆశ్రయించగా ఆయన ఆదేశాల మేరకు సర్జరీ చేశారని బాధిత రోగి వెంకటరెడ్డి భార్య గోవిందమ్మ ఫిర్యాదులో పేర్కొన్నారు. నిరుపేద రోగులకు ఉచిత వైద్యం అందించే గాంధీఆస్పత్రిలో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, డబ్బులు అడిగిన వైద్యునిపై చర్యలు చేపట్టాలని తన ఫిర్యాదులో కోరారు.

- గాంధీ ఆర్థోపెడిక్ వైద్యుడిపై బాధిత రోగి భార్య గోవిందమ్మ చేసిన లిఖితపూర్వక ఫిర్యాదు మేరకు నలుగురు వైద్యుల బృందంతో ఎంక్వైయిరీ కమిటీని ఏర్పాటు చేశాం. విచారణ చేపట్టిన కమిటీ అందించే నివేదిక మేరకు తగిన చర్యలు చేపడతామని గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి వినతి


జలమండలి సిబ్బందికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు, బస్తీవాసులు

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ బోయిగూడ, చాచానెహ్రూనగర్‌లో తాగునీటి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానికులు జలమండలి అధికారులకు వినతి పత్రం ఇచ్చారు. చాలా కాలం నుంచి నీటి ఎద్దడితో పాటు నీటి సరఫరా సమయాల కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఈ విషయమై ప్రజాప్రతినిధులు, సంబంధిత సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా ఫలితంగా లేదని వాపోయారు. నీటి ఎద్దడిని నివారించడంతో పాటు నీటి సరఫరా సమయాలను ఉదయం వేళల్లో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని జలమండలి అధికారులతో పేర్కొన్నారు. ఈ సందర్భంగా బస్తీ మహిళలు, స్థానిక నాయకులు కలిసి బోయిగూడ జలమండలి సెక్షన్ కార్యాలయం సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అశీష్, గజానంద్ తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో లక్ష్యాన్ని సాధించొచ్చు

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్


సాయికుమార్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే తలసాని

సనత్‌నగర్: పట్టుదల, కృషి ఉంటే లక్ష్యాన్ని సాధించవచ్చని నిరుపేద యువకుడు మంచోళ్ల సాయి కుమార్ నిరూపించాడని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సికింద్రాబాద్ బాలంరాయి ప్రాంతానికి సాయి కుమార్ ఈ నెల 10–13 వరకు మలేసియాలో జరిగిన అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పాల్గొని గోల్డ్ మెడల్‌ను సాధించాడు. ఈ పోటీల్లో 20 దేశాలకు చెందిన సుమారు 200 మంది వరకు పాల్గొన్నారు. గోల్డ్‌మెడల్ సాధించిన సాయి కుమార్ శనివారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఆయన నివాసంలో కలువగా అభినందించారు. అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్‌కు గుర్తింపు తీసుకురావడం పట్ల హర్షంవ్యకం చేశారు. ఉన్నతస్థాయిలో రాణించేలా తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వెంకటేషన్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా రహదారులు.. రాకపోకలకు ఇబ్బందులు

బౌద్ధనగర్: బౌద్ధనగర్ డివిజన్‌లో వివిధ ప్రాంతాల్లో ఉండే రహదారులు అస్తవ్యస్తంగా మారాయి. ఈ రహదారులపై వాహనాలు రాకపోకలకు సాగించాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వారాసీగూడలోని మసీద్‌గల్లీ రోడ్‌లో మసీదు వద్ద నుంచి సెయింట్ ఆల్బన్స్ హైస్కూల్ వరకు ఉన్న నాలాపై కొన్ని దశాబ్దాల క్రితం పైకప్పును ఏర్పాటు చేశారు. దీనిపై నుంచి వాహనాల రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ రహదారి వారాసీగూడ నుంచి రాంనగర్‌కు వెళ్లే వాహనదారులు ఉపయోగించుకుంటారు. అయితే.. ఈ పైకప్పు గతేడాది కూలిపోవడంతో అధికారులు కొత్తగా ఏర్పాటు చేశారు. ఈ రోడ్డు మసీద్ నుంచి సెయింట్ ఆల్బన్స్ వరకు ఎత్తును పెంచడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రెండు రోడ్లకు ఎత్తు తేడా చాలా ఉండటంతో ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి ఈ సమస్యపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

పంజగుట్ట పీఎస్ ఎదుట బైక్‌ను కాల్చి.. మరో బైక్‌ను దొంగిలించిన వ్యక్తి అరెస్టు

- నిందితుడు మానసిక రోగిగా గుర్తింపు
- న్యాయస్థానం ఆదేశంతో ఆస్పత్రిలో చేర్పించిన పోలీసులు

పంజగుట్ట: పంజగుట్ట పోలీస్ స్టేషన్ ముందు పార్క్ చేసి ఉన్న ద్విచక్రవాహనాన్ని తగలబెట్టి అక్కడే మరో ద్విచక్రవాహనం దొంగిలించి పారిపోయిన నిందితుడి పంజగుట్ట పోలీసులు శనివారం రిమాండ్‌కు తరలించారు. పోలీసుల సమాచారం మేరకు... ఈ నెల 22వ తేదీన పంజగుట్ట పోలీస్‌స్టేషన్ ప్రహరీని ఆనుకుని ఉన్న పార్కింగ్ స్థలంలో అంబర్‌పేటకు చెందిన మహ్మద్ హమీద్ అనే వ్యక్తి టీఎస్ 11 ఈజెడ్ 6257 నెంబర్ గల ద్విచక్ర వాహనం పార్క్‌చేసి పని నిమిత్తం బోయిన్‌పల్లికి వెళ్లాడు. సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో సదరు ద్విచక్ర వాహనం కాలిపోయింది. పక్కనే ఉన్న మరో వాహనం పాక్షికంగా దెబ్బతిన్నది. వెంటనే అక్కడకు వచ్చిన పోలీసులు మంటలను ఆర్పారు. పక్కనే ఉన్న మరో ద్విచక్రవాహనం కనిపించకుండా పోయింది. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీని గమనించారు. నిందితుడు ఎమ్.ఎస్. మక్తాకు చెందిన మొహమ్మద్ ఫిరోజ్‌ఖాన్ అలియాస్ పవన్ కుమార్(25)గా గుర్తించారు. నిందితుడు ముందు ఒక వాహనానికి నిప్పు అంటించి తరువాత మరో వాహనం తీసుకుని వెళ్లిపోయినట్లు తెలుసుకున్నారు. నిందితుడు లేక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నెక్లెస్ రోడ్డులో వాహనంపై అనుమానాస్పదంగా తిరుగుతుండగా లేక్ పోలీసులు అదుపులోకి తీసుకుని పంజగుట్ట పోలీసులకు అప్పగించారు. నిందితుడిని విచారించేందుకు యత్నించగా అతడు పొంతనలేని సమాధానం చెపుతున్నాడు. నిందితునిగూర్చి విచారించగా అతని తల్లి చనిపోతూ ఓ ముస్లింకు ఇతని పెంచే బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం. నిందితుని మానసిక స్థితి సరిగా లేదని గతంలో ఇతను ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రిలో చికిత్స కూడా తీసుకున్నాడని తెలుసుకున్నారు. ఫిరోజ్‌ఖాన్‌ను అదుపులోకి తీసుకుని న్యాయస్థానం ముందు హాజరుపరిచి తరువాత మానసిక ఆస్పత్రిలో చేర్పించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మైనర్ బాలుడి చేరదీత



అడ్డగుట్ట: ఇంట్లో నుంచి పారిపోయి వచ్చిన ఓ మైనర్ బాలుడిని ఆర్పీఎఫ్ పోలీసులు చేరదీసి హోమ్‌కు తరలించారు. ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 24న అలం పర్వేజ్(09) సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్లాట్ ఫామ్ నెం–1లో అనుమానాస్పదంగా తిరుగుతున్నాడు. గమనించిన రైల్వే పోలీసులు బాలుడి వద్దకు వెళ్లి విచారించగా ఇంట్లో నుంచి పారిపోయి వచ్చినట్లు చెప్పడంతో సైదాబాద్‌లోని హోమ్‌కు తరలించారు.

శుభకార్యానికి వెళ్లొచ్చేసరికి ఇల్లుగుల్ల

అమీర్‌పేట: పూజారి ఇంట్లో చోరీ జరిగిన సంఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. సనత్‌నగర్ లింగయ్యనగర్‌లో ఉండే నగేష్ ఎస్ఆర్‌నగర్ వేంకటేశ్వర దేవాలయంలో పూజారిగా పని చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లి రాత్రి తిరిగి ఇంటికి వచ్చేసరికి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని వస్తువులు చిందరవందరంగా పడి ఉన్నాయి. అందులో దాచిన రెండున్నర తులాల బంగారు, 75 గ్రాముల వెండి ఆభరణాలు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి పాత నేరస్థులే దొంగతనానికి పాల్పడ్డట్టు గుర్తించారు.

నీరు నిల్వనివ్వం.. ప్రమాదాలు జరగనివ్వం!

- వాటర్ లాగింగ్ పాయింట్లపై దృష్టి
- ప్రత్యేక చర్యల్లో నిమగ్నం
- మ్యాన్‌హోళ్ల వద్ద హెచ్చరిక బోర్డులు, సేఫ్టీ గ్రిల్స్ ఏర్పాటు
- రంగంలోకి దిగిన జలమండలి అధికారులు


మ్యాన్‌హోల్ లోపల సేఫ్టీ గ్రిల్ ఏర్పాటు చేస్తున్న దృశ్యం

సనత్‌నగర్: మరికొన్ని రోజుల్లో వానాకాలం వచ్చేస్తోంది. రోడ్లను ముంచెత్తే వరదతో ఎక్కడ ఏ మ్యాన్‌హోల్ మూత తెరిచి ఉంటుందో తెలియని పరిస్థితి. ఇంకోవైపు వరదనీటి కాలువల పైకప్పులు సరిగా లేక అడుగుతీసి అడుగు వేయాలంటే ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సిందే. వర్షాకాలం వచ్చిందంటే ప్రతియేటా ఇదే తీరు. ముఖ్యంగా వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. అయితే వానాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో ఈ సారి నగరవాసుల ఇబ్బందులను తొలగించే దిశగా జలమండలి అధికారులు కార్యాచరణ ముమ్మరం చేశారు. ప్రమాదకర మ్యాన్‌హోళ్లు ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించారు. ఇప్పటికే వాటర్ లాగింగ్ పాయింట్లపై సమగ్ర నివేదికను అటు ట్రాఫిక్ పోలీసులు, ఇటు జీహెచ్ఎంసీ అధికారులు జలమండలికి అందజేశారు. సనత్‌నగర్, అమీర్‌పేట డివిజన్ల పరిధిలో ఏడు చోట్ల వాటర్ లాగింగ్ పాయింట్లను గుర్తించారు. అలాగే బేగంపేట, రాంగోపాల్‌పేట, బన్సీలాల్‌పేట డివిజన్లలో ప్రధానంగా మరో ఏడు చోట్ల వాటర్ లాగింగ్ పాయింట్లు గుర్తించి ఆ దిశగా జలమండలి అధికారులు చర్యలు చేపట్టారు. ముఖ్యంగా వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద ప్రమాదాలు చోటు చేసుకోకుండా చేపట్టాల్సిన చర్యలపై దృష్టి సారించారు.

చేపట్టిన చర్యలు..

- ఎక్కడెక్కడ డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల మూతలు లేవనే అంశంపై దృష్టి సారించి లేనిచోట కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు. ఒకవేళ మ్యాన్‌హోళ్లు ధ్వంసమై ఉంటే వాటికి మరమ్మతులు చేస్తున్నారు.
- మ్యాన్‌హోళ్లు రహదారికి సమాంతరంగా కాకుండా లోతుగా ఉన్న వాటికి సేఫ్టీ గ్రిల్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఒకవేళ మ్యాన్‌హోల్ మూత తెరిచినప్పటికీ పొరపాటున ఎవరైనా మ్యాన్‌హోల్ వైపు జారి పడినా సేఫ్టీ గ్రిల్స్ ఉండడంతో లోపలికి వెళ్లే ఆస్కారం ఉండదు.
- వాటర్ లాగింగ్ పాయింట్‌తో పాటు ప్రమాదకర మ్యాన్‌హోల్‌గా తెలియజేస్తూ సేఫ్టీ గ్రిల్స్‌ను ఏర్పాటుచేయడంతో పాటు రంగులను వేసి వాహనదారులను అప్రమత్తం చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.
- వరదనీరు నిలిచిపోయే ప్రాంతాల వద్ద ఇక్కడ వరదనీరు నిలుస్తుందని అప్రమత్తం చేస్తూ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తున్నారు.
- వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద చేపట్టాల్సిన చర్యలతో పాటు వర్షాలు పడినప్పుడు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టీమ్‌లను అప్రమత్తం చేస్తూ ఆయాచోట్ల విధుల్లో ఉండి వెంటనే సహాయక చర్యలు చేపట్టడంపై దృష్టి సారించనున్నారు.
- అదే క్రమంలో వరదనీటిని ఒడిసి పట్టుకునేలా చేయడంపై దృష్టి సారించనున్నారు. ఇళ్ల వైపు నుంచి వరదనీటిని డ్రైనేజీలోకి వెళ్లకుండా ఇళ్లల్లో ఇంకుడుగుంతలు చేసుకోవడం ద్వారా భూగర్భ జలమట్టాన్ని పెంచుకోవచ్చని అవగాహన కల్పించనున్నారు.
- వరదనీరు డ్రైనేజీ మ్యాన్‌హోళ్లలోకి పంపడం ద్వారా ఆ నీళ్లతో పాటు ఇసుక, రాళ్లు, వ్యర్థాలు డ్రైనేజీలోకి చేరి బ్లాక్ అవుతున్నాయని, ఇకపై అలా కాకుండా ఇంకుడు గుంతల్లోకి మళ్లించడమో, లేక ప్రత్యేకంగా నిర్మించిన వరద కాలువల్లోకి వెళ్లేలా దృష్టి సారిస్తున్నారు.


ఇక్కడ లోతైన మ్యాన్‌హోల్ ఉందంటూ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

వాటర్ లాగింగ్ పాయింట్లు ఇవే..

ఈఎస్ఐ సెయింట్ థెరిస్సా చర్చి, మైత్రీవనం జంక్షన్, హోలీ క్రాస్ ఎదురుగా, ఫతేనగర్ బ్రిడ్జి, మెహెఫిల్ హోటల్, బల్కంపేట–బేగంపేట రహదారిలోని న్యూబ్రిడ్జి, పాస్‌పోర్ట్ ఆఫీసు (ఆదిత్య ట్రేడ్ సెంటర్), లీలానగర్ మోత్కుపల్లి నర్సింహులు హౌస్, బేగంపేట లైఫ్‌స్టైల్ ఎదురుగా, సీఎం క్యాంప్ ఆఫీసు, జోఆలుకాస్ ‘యూ’టర్న్, ఎస్ఎఫ్‌సీఎల్ స్టార్టింగ్ ఫ్లైఓవర్ ప్రాంతాలు. అల్లంతోటబావి, చీకోటి గార్డెన్, ప్రకాష్‌నగర్, ఎస్‌సీ బీసీ కాలనీ, బాపుబాగ్ కాలనీ, బొంబే హోటల్ జంక్షన్ ప్రాంతాలు.

నిష్ణాతులుగా ఎదిగినప్పుడే గుర్తింపు


సదస్సుకు హాజరైన వివిధ రంగాల ప్రతినిధులు

సనత్‌నగర్: బేగంపేటలోని మనోహర్ హోటల్‌లో శనివారం క్రియేటివ్ కెరీర్స్ ఎడ్యుకేషన్ సమ్మిట్‌–2024 ఉత్సాహంగా జరిగింది. జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్, ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ, బోర్డు ఆఫ్ ఇంటర్మీడియేట్ ఎడ్యుకేషన్, టాస్క్, ఎంఎస్ఎంఈ తదితర సంస్థల సహకారంతో జరిగిన సమ్మిట్‌లో వివిధ రంగాలకు చెందిన నిపుణులు, 600 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. ఏ రంగంలో ఉన్న ఆ రంగంపై నిపుణత సాధించినప్పుడే ఉన్నత శిఖరాలకు చేరువవుతారన్నారు. ప్రతి రంగానికో ప్రత్యేకత ఉంటుందని, ఆ రంగంలో నిష్ణాతులుగా ఎదిగినప్పుడే గుర్తింపు ఉంటుందన్నారు. ఈ తరహా సదస్సులు విద్యార్థులు, నైపుణ్యం పెంచే సంస్థలకు మధ్య వారధిగా నిలుస్తాయన్నారు. అన్ని విద్యా సంస్థలను ఒకేచోట చేర్చడం ద్వారా విద్యార్థులకు అవసరమైన సమగ్ర సమాచారం అందుబాటులో ఉంటుందన్నారు. ఈ సదస్సు ద్వారా యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, ఫొటోగ్రఫీ, ఫిల్మ్‌మేకింగ్, ఫ్యాషన్, మేకప్ తదితర రంగాలకు సంబంధించిన సమగ్ర సమాచారం అందుబాటులో ఉంచారు. ఆయా అంశాలపై ని పుణులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. శృతి ఓజా, శ్రీకాంత్ సిన్హా, సారధికృష్ణ, పీకే పోలిన, ప్రతిభ, రిషబ్ గుప్తా, కమల్‌రాయ్, గీత, గోపీ గణేష్, అరణ దాసరి, బండి రమణ, భాస్కర్‌రాజు, రాధిక బడేలా, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఫేక్ ఐడీ సృష్టించి.. డబ్బులు దోచి..

స్విగ్గీ డెలివరీ బాయ్ రిమాండ్

కంటోన్మెంట్: ఈజీమనీకి అలవాటు పడి ఓ హోటల్‌కు సంబంధించి ఫేక్‌ఐడీని క్రియేట్ చేసి డబ్బులు దండుకుంటున్న స్విగ్గీబాయ్‌ను రిమాండ్‌కు తరలించిన ఘటనా కార్ఖానా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రవికుమార్ కథనం ప్రకారం.. బాలాజీనగర్‌కు చెందిన సందీప్(28) స్విగ్గీ డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. ఇందులో వచ్చే సంపాదనతో సరిపోకపోవడంతో ఈజీ మనీకి అలవాటు పడి వక్రమార్గాలకు తెర లేపాడు. కార్ఖానాలోని గ్రిల్ నైన్ హోటల్‌కు సంబంధించి క్రౌడ్ చికెన్ యాప్ ద్వారా ఫేక్‌ఐడీని క్రియేట్ చేశాడు. చికెన్‌కు సంబంధించిన తిను బండారాలు షావర్మ, ఇతర ఆహార పదార్థాల ఆర్డర్లకు సంబంధించిన డబ్బులను ఫేక్ ఐడీ క్రియేట్ చేసుకొని ఆన్‌లైన్‌లో తన ఖాతాలోకి మళ్లించుకుంటున్నాడు. ఇప్పటివరకు దాదాపు రూ. 30 వేల పైగా ఆన్‌లైన్‌లో మోసానికి పాల్పడ్డాడు. కస్టమర్లకు ఆహార పదార్థాలను పంపిణీ చేస్తున్నప్పటికీ తమఖాతాలో నగదు జమ కాకపోవడాన్ని గుర్తించిన గ్రిల్‌నైన్ హోటల్ నిర్వాహకులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఫేక్ ఐడీతో డబ్బులు దండుకుంటున్న సందీప్‌ను రిమాండ్‌కు తరలించారు.

వేరొకరి పరీక్ష రాస్తూ పట్టుపడ్డ యువకుడిపై కేసు

అమీర్‌పేట: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలో వేరొకరి పరీక్ష రాస్తూ ఓ యువకుడు పట్టుబడిన ఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి వివరాల ప్రకారం.. యూసుఫ్‌గూడ రహమత్‌నగర్‌కు చెందిన నీలం లోకేష్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు.ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు ఎస్ఆర్‌నగర్‌లోని శ్రీ సూర్య జూనియర్ కళాశాలలో సెంటర్ పడింది. శుక్రవారం జరిగిన సంస్కృతం పేపర్‌–2 పరీక్షకు నీలం లోకేష్‌కు బదులుగా యూసుఫ్‌గూడకు చెందిన సోద వరప్రసాద్ హాజరయ్యాడు.పరీక్షా కేంద్రం మొదటి అంతస్తులోని రూమ్ నెం.101లో ప్రసాద్ పరీక్ష రాస్తుండగా ఇన్విజిలేటర్‌గా ఉన్న రోజ అనుమానంతో హాల్ టికెట్‌ను పరిశీలించగా వేరొకరి పరీక్ష రాస్తున్నట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

అడ్డగుట్ట: రైలుకింద పడి గుర్తు తెలియని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం..సికింద్రాబాద్‌– లాలాగూడ రైల్వే స్టేషన్ల మార్గమధ్యలోని పట్టాలపై ఈ నెల 24న సుమారు 30–35 ఏళ్ల వయస్సున్న గుర్తు తెలియని వ్యక్తి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడు పసుపు రంగు టీషర్ట్, బ్లూ కలర్ జీన్స్ ధరించినట్లు పోలీసులు తెలిపారు.

కాంగ్రెస్‌తోనే నిరుద్యోగులకు న్యాయం


మాట్లాడుతున్న ఓరుగంటి కృష్ణ

ఉస్మానియా యూనివర్సిటీ: కాంగ్రెస్ పార్టీ పాలనలోనే నిరుద్యోగులకు న్యాయం జరుగుతుందని పలువురు పేర్కొన్నారు. శనివారం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా జరిగిన కార్యక్రమంలో కేయూ ప్రొ.వీరన్న, ఓయూ జేఏసీ చైర్మన్ ఓరుగంటి కృష్ణ, డా.శంకర్, డా.విష్ణు మాట్లాడుతూ.. తీన్‌మార్ మల్లన్నను గెలిపించేందుకు కృషి చేస్తామన్నారు.

నేడు సంకటహర చతుర్థి

సనత్‌నగర్: సంకటహర చతుర్థి సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానంలోని గణపతి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ శ్రీనివాసరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30 గంటలకు గణపతి హోమం, సాయంత్రం 6 గంటలకు పంచామృత అభిషేకం, ప్రత్యేక అలంకరణ దర్శనం ఉంటాయని పేర్కొన్నారు.

జీహెచ్ఎంసీలో కాంట్రాక్ట్ ఉద్యోగాల పేరుతో మోసం

- నకిలీ ఐడీ కార్డులు జారీ
- 10 రోజులపాటు పని చేయించిన వైనం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

ఖైరతాబాద్: జీహెచ్ఎంసీలో కాంట్రాక్ట్ పద్ధతిలో స్వీపింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి 30 మంది నుంచి డబ్బులు వసూలు చేసిన వారిపై సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... ఆసిఫ్‌నగర్‌లో ఉండే సాయికుమార్ పదవ తరగతి ఫెయిల్ అయ్యాడు. డబ్బు సంపాదించాలనే ఆశతో తాను జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయంలో పనిచేస్తానని, తనకు అధికారులతో పరిచయాలున్నాయని 30 మందిని నుంచి కాంట్రాక్ట్ పద్ధతిలో స్వీపింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించాడు. మొదట ఎంట్రీ ఫీజు కింద రూ. 10 వేలు, ఐడీ కార్డు జారీ చేయగానే రూ. 15 వేలు, జాయినింగ్ కాగానే మరో రూ. 15 వేలు ఇలా ఒక్కొక్కరి వద్ద రూ. 30 వేల నుంచి రూ. 40 వేల వరకు మొత్తంగా రూ. 10.5 లక్షలు వసూలు చేశాడు. వారికి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, ఔట్ సోర్సింగ్ స్టాఫ్, శానిటేషన్ వర్కర్లుగా నకిలీ ఐడీ కార్డులు చేయించాడు. జీహెచ్ఎంసీ సెంట్రల్ జోన్ కార్యాలయం పరిధిలో ఏఎంఓహెచ్ సంతకంతో ఐడీ కార్డులు జారీ చేశాడు. అంతేకాకుండా ఏప్రిల్‌లో వారితో పది రోజుల పాటు ఉదయం 6 నుంచి 10 గంటల వరకు రవీంద్రభారతి పరిసర ప్రాంతాల్లో స్వీపింగ్ పనులు చేయించాడు. ఉదయం 10 కాగానే మీరు వెళ్లిపోండి అంటూ వారిని పంపుతుడటంతో అనుమానం వచ్చి ఆరా తీశారు. తాను చెప్పిన రాజశేఖర్ అనే సూపర్‌వైజర్ జీహెచ్ఎంసీలో ఎవరూ లేరని తెలుసుకున్నారు. డబ్బులు పంపిన నెంబర్‌కు ఫోన్ చేయగా ఆ నెంబర్ ఆసిఫ్‌నగర్‌లో ఓ షాపు వ్యక్తిదని, ఆ వ్యక్తి తనకు ట్రాన్స్‌ఫర్ అయిన డబ్బులో తన పర్సెంటేజ్ తీసుకొని మిగతా డబ్బులు సాయికుమార్ ఇస్తానని తనకేమీ తెలియదని చెప్పాడు. కళావతి అనే మహిళ పోలీసుకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సెల్‌ఫోన్ల స్నాచింగ్ ముఠా రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ రవికుమార్

అమీర్‌పేట: సెల్‌ఫోన్ల స్నాచింగ్‌కు పాల్పడుతున్న ముఠాను రిమాండ్‌కు తరలించిన ఘటన ఎస్ఆర్ నగర్ పోలీస్ స్టేషన్‌లో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, డీఐ జానకి రాములు తెలిపిన వివరాల ప్రకారం.. బాలానగర్‌లోని ఫిరోజ్‌గూడకు చెందిన కె.సాయి హనుమాన్ (19), బాలానగర్ రాజు కాలనీకి చెందిన మహ్మద్ అఫ్రోజ్ (19), మహ్మద్ నసీరుద్దీన్ పటేల్ (18), బాలానగర్ గౌతం కాలనీకి చెందిన బాట్లు కుమార్‌షా (20) ముఠాగా ఏర్పడి నగరంలోని వివిధ చోట్ల ద్విచక్ర వాహనాలపై తిరుగుతుంటారు. ఒంటరిగా వెళ్లే వారిని వెంబడిస్తూ సెల్‌ఫోన్‌లు లాక్కుని ఉడాయిస్తారు. చోరీలు చేయడం కోసం ద్విచక్ర వాహనాలు సైతం దొంగిలిస్తున్నారు. చోరీ చేసిన ఫోన్లను ఓ బాలుడు గౌతం నగర్‌కు చెందిన మహ్మద్ ఇమ్రాన్ (22)కు ఇచ్చి వారితో తక్కువ ధరకు అమ్మిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఎస్ఆర్‌నగర్, బాలానగర్, కూకట్‌పల్లి, మాదాపూర్,హైటెక్ సిటీ, సనత్‌నగర్ పరిధిలో సెల్‌ఫోన్ చోరీలకు పాల్పడ్డారు.తాజాగా ఎస్ఆర్‌నగర్‌లో మూడు చోట్ల చోరీలు చేశారు. బాధితుల ఫిర్యాదుతో అప్రమత్తమైన పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంగా ముఠాను రిమాండ్‌కు, మైనర్ బాలుడిని జువైనల్ హోమ్‌కు తరలించారు.

చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు..

లాలాపేట: చోరీలకు పాల్పడుతున్న ముగ్గురిని రిమాండ్‌కు తరలించిన ఘటన ఓయూ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ రవి కథనం మేరకు.. కర్నాటకకు చెందిన గోవిందప్ప సునీల్(34) నాంపల్లిలోని ఓ హోటల్‌లో వంటమనిషి. అదే ప్రాంతానికి చెందిన సుల్తానా(41) అనే మహిళతో కలిసి బైక్‌లు, సెల్‌ఫోన్ల చోరీలకు పాల్పడుతూ మదన్‌పేట్‌లోని బైక్ మెకానిక్ అహ్మద్ పాషా(24)కు విక్రయిస్తుంటారు. ఈ నెల 19న శివప్రసాద్ అనే వ్యక్తి సీతాఫల్‌మండి రైల్వే స్టేషన్ వద్ద తన బైక్‌ను పార్క్ చేసి వెళ్లి సాయంత్రం వచ్చేసరికి బైక్ కనిపించకపోవడంతో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా దొంగలను ఈ నెల 20న సికింద్రాబాద్‌లో, అహ్మద్ పాషాను సంతోష్ నగర్‌లో అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.